క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఇటీవల శ్రీలంకలో నిర్వహించిన అంతర్జాతీయ క్రీడల పోటీల్లో సత్తా చాటిన జహీరాబాద్ విద్యార్థులను ఎమ్మెల్యే మాణిక్‌రావు శనివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని హోతి(కే) బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు శ్రీలంకలోని కొలంబియాలో నిర్వహించిన అంతర్జాతీయ ఒలంపిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్ విభాగంలో థాయిలాండ్‌తో పోటీపడి మూడో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో కోచ్ దీప, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, సొసైటీ చైర్మన్ మచ్చేందర్ పాల్గొన్నారు.

వీరశైవ జంగమ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: వీరశైవ జంగమ సంఘానికి సంగారెడ్డిలో స్థలం కేటాయించాలని కోరుతూ సంఘం నాయకులు రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్‌కు శనివారం క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి సంఘం భవనానికి స్థలం కేటాయించేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. సంఘం అధ్యక్షుడు మడుపతి వీరేశం, ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, లీగల్ కన్వీనర్ సిద్దయ్యస్వామి, సభ్యులు మడుపతి మహేశ్వర్ జంగం సురేష్ పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డుకు నీలం లత ఎంపిక



నీలం లత

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం గ్రామానికి చెందిన నీలం లత ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో ప్రజలకు సేవ చేసే వ్యక్తులను గుర్తించి ఈ అవార్డులను అందించనున్నారు. ఈ నెల 5న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో నీలం లతకు ఎక్స్‌లెన్స్ అవార్డును అందించనున్నట్లు వికలాంగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నయీం తెలిపారు. తన సేవలను గుర్తించి ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందని నీలం లత అన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్టెక్స్ పరిశ్రమ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా లాకౌట్ చేసిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య అన్నారు. లాకౌట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ హార్టెక్స్ పరిశ్రమ ఎదుట శనివారం సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ హార్టెక్స్ పరిశ్రమ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా లాకౌట్ చేయటం సరైంది కాదన్నారు. దీంతో కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. తక్షణమే కార్మికులకు న్యాయం జరిగేవిధంగా లాకౌట్‌ను ఎత్తివేసి విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గీతారెడ్డితో మాణిక్‌రావు ఠాక్రే సమావేశం



జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, జహీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గీతారెడ్డితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే సమావేశమయ్యారు. శనివారం మాణిక్‌రావు ఠాక్రే గీతారెడ్డిని మర్యాదపూర్వకంగా ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవహారాలపై చర్చించినట్లు సమాచారం.

భారీగా మట్టి తరలింపు

- నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో అక్రమ మట్టి వ్యాపారం



కొడకంచి శివారులోని క్రషర్ సమీపంలో మట్టి తీయటంతో ఏర్పడిన భారీ గుంత

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల నుంచి అక్రమంగా మట్టి తరలుతోంది. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. మండలంలో మూడు నెలల నుంచి ఈ అక్రమ వ్యాపారం కొనసాగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. జిన్నారం మండలంలోని ఆయా గ్రామాల్లో మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొడకంచి గ్రామంలోని కంకర క్రషర్‌కు కేటాయించిన స్థలం నుంచి అక్రమంగా మట్టి సమీపంలోని పరిశ్రమలకు తరలిస్తున్నారు.

రాత్రి సమయంలో..

మట్టిని తరలిస్తున్నా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల అండతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఎవరైనా మట్టి తరలిస్తున్న విషయమై ప్రశ్నిస్తే ముఖ్య ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్‌లు రావటంతో వారు కూడా కిమ్మనకుండా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అందూర్ గ్రామ శివారులో రాత్రి సమయంలో జోరుగా మట్టి తరలింపు జరుగుతోంది. గుమ్మడిదల మండలంలోని అన్నారం, దోమడుగు, బొంతపల్లి గ్రామాలకు రాత్రి సమయంలో మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా మట్టి తరలింపు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. రాత్రికి రాత్రే లక్షల రూపాయల మట్టి వ్యాపారం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవటం వివాదాలకు దారితీస్తుంది. మట్టిని తరలిస్తుండటంతో భారీగా గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఇప్పటికైన అధికారులు కల్పించుకోని మట్టిని తరలింపును నివారించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

మట్టి తరలుతున్న విషయం తమ దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మట్టిని తరలిస్తే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలి.

– దశరథ్‌సింగ్ రాథోడ్, తహసీల్దార్, జిన్నారం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



విద్యార్థులతో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో విద్యార్థులను సన్మానించారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని బీ హ్యూమన్ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఖేడ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వార్షిక పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన 70మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదుతో పాటు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు. అనంతరం నిజాంపేట్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసి ఆర్వో ప్లాంటును సర్పంచ్ జగదీశ్వరాచారి, నాయకులతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. సీడీపీఓ సుజాత, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్ పాల్గొన్నారు. వల్లూరు ఉపసర్పంచ్ షాకీర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు జహంగీర్, అయూబ్, ఫసియొద్దీన్ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పండరి యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు. నమ్లిమేట్‌కు చెందిన అనిల్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. అదేవిధంగా వివిధ గ్రామాల్లో ఇటీవల ఇళ్లు కూలిన పలువురు బాధితులకు ఒక్కొక్కరికి రూ.3,200 చెక్కులు అందజేశారు.

రెడ్డి సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో రెడ్డి సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వం మూడు గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించడంతో పాటు రూ.5లక్షలు మంజూరు చేయగా ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్, రైబస అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, రమేష్ చౌహాన్, రెడ్డి సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రైడెంట్ కర్మాగారాన్ని ప్రభుత్వమే నడపాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నడపాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గం ఇన్‌చార్జి ఆశప్ప డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశప్ప మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో అధికశాతం మంది రైతులు చెరకు పంటపై ఆధారపడి పంట సాగు చేస్తున్నారన్నారు. గత సంవత్సరం ట్రైడెంట్ కర్మాగారానికి సరఫరా చేసిన చెరకు పంటకు సంబంధించిన పూర్తి బిల్లులు నేటికీ చెల్లించలేదన్నారు. రైతులకు యాజమాన్యం రూ.12 కోట్లు బకాయిపడినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి కర్మాగారాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని క్రషింగ్ చేసి రైతుల కష్టాలను తొలగించాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, మక్బూల్, ప్రేమ్‌కుమార్, పాండు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ



విద్యార్థులు, ఉపాధ్యాయులతో రాజమల్లారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక యువజన నాయకుడు రాజమల్లారెడ్డి శనివారం నోట్‌బుక్స్, బ్యాగ్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయం చేసేందుకు ప్రతిఒక్కరూ తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మి, అరుణాదేవి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, మాజీ సర్పంచ్ పాండరి, నాయకులు సురేందర్‌రెడ్డి నరేందర్‌యాదవ్, రాజు, శ్రీశైలం, ఎండీ ఖదీర్, శ్రీకాంత్, మహేష్ నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–4



మునిపల్లి: తనిఖీ చేస్తున్న అధికారులు



సదాశివపేటలో..



జహీరాబాద్ టౌన్‌లో..

మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ హోక్స్ వ్యాగన్ స్కూల్‌లో గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 1056 మంది హాజరు కావల్సి ఉండగా 891 మంది పరీక్ష రాయగా 165 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు 1056 మంది పరీక్ష రాయాల్సిఉండగా 893 మంది పరీక్ష రాయగా 163 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని భవిత జూనియర్ కలాశాల, పద్మనాభ డిగ్రీ కళాశాల, సెంట్‌మేరీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ విధించారు.

జహీరాబాద్ టౌన్: పట్టణంలో గ్రూప్ 4 పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీగాయత్రి జూనియర్ కళాశాల, తపస్య జూనియర్ కళాశాల, హోతి(కె) గురుకుల పాఠశాల, యూనిటెడ్ పబ్లిక్ పాఠశాల, అల్గోల్ బాలుర గురుకుల పాఠశాల, ఆర్‌ఎల్‌ఆర్ స్కూల్, స్రవంతి జూనియర్ కళాశాల, నవచైతన్య జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో 2856 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 2342 మంది హాజరుకాగా 514 మంది గైర్హాజర్ అయినట్టు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆటో సౌకర్యం



ఆటోలను ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను చదువుకునేందుకు తగిన రవాణా సౌకర్యం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు విద్యార్థుల రవాణ సౌకర్యం కోసం రెండు ఆటోలను సమకూర్చారు. ఈ ఆటోలను స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ దయానంద్ తదితరులు శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంబాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసించేందుకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మడిదలకు వెళ్లాల్సి వస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల సౌకర్యార్థం నీలం మధు ప్రత్యేక ఆటోలను సమకూర్చటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గ్యారాల మల్లేశ్, వీరేశ్, నర్సింలు, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు



గంధం ఊరేగిస్తున్న ముస్లింలు

మునిపల్లి(అందోల్): బక్రీద్ పండుగను పురస్కరించుకుని మల్లికార్జునపల్లి గ్రామంలో మిలాదున్‌నబీ పండుగ పురస్కరించుని శనివారం స్థానిక మసీదు నుంచి గ్రామ సమీపంలోని సయ్యద్‌షా ఫక్రుద్దీన్ ఖాదిరి అలీ హుసేని దర్గా వరకు గంధం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు సజ్జద్‌నసీన్, సయ్యద్‌రఫీ, ఉద్దీన్‌ఖాద్రి, ఆల్ హుసేని, బంధం నవాజ్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



జోగిపేటలో డాక్టర్లను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు



జహీరాబాద్: నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): డాక్టర్స్ డే సందర్భంగా మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుమ్మడిదల గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను శనివారం ఘనంగా సన్మానించారు. మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ కుమార్ వైద్యులు మధుకర్ పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి): డాక్టర్స్ డే సందర్భంగా శనివారం బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేశ్వర దేశ్‌పాండే జిల్లా హాస్పిటల్ మాజీ సూపరింటెండెంట్ సాయిరాం, ఎండీ డాక్టర్ రాజాగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎంతోమందికి సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట నరసింహారెడ్డి, పోచారం రాములు, మందుల నాగరాజ్, కసినివాసు దోమల విజయకుమార్, పాపయ్య మీనాగౌడ్, బిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, నరేస్ దేశ్ముండా, లింగమూర్తి, రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): డాక్టర్స్ డే సందర్భంగా జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లను ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్లు రమేష్, శంకర్‌బాబు, అనూష, వరలక్ష్మి, భారతి, దివ్యజ్యోతి, శ్రీవీణ, తేజ, సిద్ధార్థను తహసీల్దార్ వెంకటేశం, లయన్స్ క్లబ్ డయాబెటిస్ జిల్లా చైర్మన్ డాక్టర్ అనంతరెడ్డి, జోన్ చైర్మన్ ఆకుల రాంబాబు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శేరి సంగారెడ్డి, అల్లే శ్రీకాంత్, కోశాధికారి రవిశేఖర్‌రెడ్డి, సభ్యులు యశ్వంత్‌రెడ్డి, రామకృష్ణ, సంతోష్, సంతోష్ కలిసి సన్మానించారు. అనంతరం ఆయా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు బిస్కెట్ల పంపిణీ, స్కూల్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. అదేవిధంగా స్థానిక డీఎస్ రెడ్డి ఆస్పత్రి ఆవరణలో డయాబెటిస్ క్యాంపు నిర్వహించారు. అనాథలకు అన్నదానం చేశారు.

జహీరాబాద్: డాక్టర్స్ డే సందర్భంగా భరత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ నాగరాజు పాటిల్, అధ్యక్షుడు మహేష్, సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, సొహైల్, సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, వైద్యులు పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఆర్‌ఎంఓలు డాక్టర్ ఆంజనేయులు, రవి కుమార్, అసిస్టెంట్, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్, శ్రీలేఖ, రాధిక, నాగలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, చిరంజీవి అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు లడ్డు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

వట్‌పల్లి(అందోల్): జోగిపేట గుమాస్తా సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం జోగిపేటలోని సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాకూరి శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా నవాజ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రగొళ్ల మహేష్‌యాదవ్, కోశాధికారిగా నర్సింలు, దుర్గయ్య, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, రాములు, నాగరాజు, ఆనంద్, మల్లేశం, కృష్ణ, బలరాం, మల్లేశం లక్ష్మయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు.

◆ మత్స్యకారుల హక్కుల సాధనకు కృషి

వట్‌పల్లి(అందోల్): మత్స్యకారుల హక్కుల సాధనకు కృషి చేస్తానని, జిల్లా మత్స సహకార సంఘ ఎన్నికల్లో తనను గెలిపించాలని నగేష్ ముదిరాజ్ కోరారు. శనివారం జోగిపేట ముదిరాజ్ భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 4న జరిగే జిల్లా మత్స సహకార సంఘ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి తాత్కాలిక చైర్మన్‌గా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చాపల వెంకటేశం, సునీల్, గోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు

◆ చెట్టును తొలగించాలని వినతి

నారాయణఖేడ్: మండల పరిధిలోని లింగాపూర్‌లో ఇళ్ల మధ్యన ప్రమాదకరంగా ఉన్న చింతచెట్టును తొలగించాలని గ్రామస్తులు శనివారం తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చింతచెట్టు దశాబ్దాల కిందట నాటింది కావడంతో చిన్నపాటి గాలులు వీచినా కొమ్మలు విరిగి ఇళ్లపై పడుతున్నాయన్నారు. ఇటీవల గాలులకు పెద్దకొమ్మ విరిగి ఓ ఇంటిపై పడగా ఇల్లు పూర్తిగా దెబ్బ తిన్నదని వివరించారు. అధికారులు స్పందించి వెంటనే చెట్టును తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శంకరయ్యను స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరకాలనీలో సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.53 లక్షలు, ఎంజీ రోడ్డు వెడల్పు పనులకు రూ.33లక్షలతో పాటు శ్మశానవాటికలో చితి మండపాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ, తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద రోడ్డు వెడల్పు పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కమార్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ ఘనంగా ఎల్‌ఐసీ ఉద్యోగుల యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం



జహీరాబాద్ టౌన్: ఎల్‌ఐసీ ఉద్యోగులు, ఏజెంట్ల యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. సంఘం బ్రాంచి కార్యదర్శి అశోక్, యూనియన్ నాయకులు నర్సింలు, విజయభాస్కర్, ఏజెంట్లు సుభాష్, ప్రభుశంకర్, రాజ్‌కుమార్, నర్సింలు, ప్రభు, అంజయ్య పాల్గొన్నారు.

జహీరాబాద్: పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో శనివారం ఏఐఐఈఏ (ఆల్ ఇండియా ఇన్సురెన్స్ అసోసియేషన్) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీఈయు కార్యదర్శి అశోక్, ఐసీఈయూ నాయకులు చంటి, నర్సింహులు, విజయశేఖర్, ఏజెంట్లు సుభాష్, ప్రభుశంకర్, రాజనర్సింహ, ప్రభు, అంజయ్య, నర్సింహులు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ బకాయి వేతనాలు చెల్లించాలి

కంది(సంగారెడ్డి): ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎంఏ.ఖాజా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరువారాలు పనిచేసినా కూలి డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డబ్బుల కోసం ఎంపీడీఓ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు.

◆ ఘనంగా బ్యాంక్ డే

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎస్‌బీఐలో శనివారం బ్యాంక్ డే సందర్భంగా బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు, ఖాతాదారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 68 సంవత్సరాల నుంచి కస్టమర్లకు బ్యాంక్ ద్వారా సేవలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు బరూర్ దత్తాత్రి పాల్గొన్నారు.

◆ వేంకటాచల దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తుల గోవింద నామస్మరణ.. అన్నమయ్య సంకీర్తనల నడుమ భక్తకోటి కలియుగ దైవం ఆ ఏడుకొండల వేంకటేశ్వరుడికి శనివారం మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోని వేంకటాచల దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కొండాపూర్(సంగారెడ్డి): బీసీ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని బీసీ బాయ్స్ కళాశాల హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్ సమయానికి రావడం లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంలేదన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ధరలు పెరిగాయి, ధరలకు అనుకూలంగా భోజనం పెట్టాల్సి వస్తోందని వార్డెన్ చెప్పుకొచ్చారన్నారు. ప్రభుత్వం పెంచిన మెస్‌చార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ టౌన్ నాయకులు సాయిచరణ్, ప్రభు, మహేందర్, రాజు, రాజేష్, వంశీ, తరుణ్, పాల్గొన్నారు.